కె. బి. కృష్ణ

# లిటిల్ రాస్కెల్

పెద్ద రంగు రంగుల జంపఖానా. దానిమీద ఒక పళ్ళెంలో పుస్తకాలు, బంగారం నగలు, ఒక పళ్ళెం నిండా డబ్బు, మరో పళ్ళెంలో మిఠాయిలు, ఒక పళ్ళెంలో పసుపు కుంకం ఇంకా ఎన్నోరకాలు ఏర్పాటు చేసి వున్నాయి.

అసలు విషయం ఆరోజు శ్రీనివాసరావు సుపుత్రుడికి అన్నప్రాశన. వాటికి ఎదురుగా శ్రీనివాసరావు తన ముద్దుల కొడుకుని ఎత్తుకుని నిలబడ్డాడు.

"తన కుటుంబంలో అందరూ పెద్ద చదువులు చదువుకుని, పెద్ద ఉద్యోగాలు చేస్తున్నారు. అన్నప్రాశన చేసినప్పుడు పసిపిల్లలు ముందుగా ఏది ముట్టుకుంటే ఆ విషయంలో ప్రసిద్ధి చెందుతారని నమ్మకం. ఒకవేళ డబ్బు వున్న పళ్ళెం పట్టుకున్నాడనుకోండి, బాగా డబ్బు సంపాదిస్తాడన్న మాట. తన కొడుకు పుస్తకం పట్టుకుంటాడని, అలా పట్టుకుంటే తన కుటుంబంలో మిగతావారిలాగే వాడూ పెద్ద ఆఫీసరు అవుతాడని శ్రీనివాసరావు నమ్మకం. కుటుంబ సభ్యులందరూ వచ్చి నిలబడ్డారు. బుజ్జిగాడిని బోర్లా పడుకోబెట్టి వదిలేసి అందరూ దూరంగా నిలబడ్డారు.

ముందు వరుసలో పుస్తకాలు, బంగారం, వెండి, డబ్బు వుంచారు. మిఠాయిలు వగైరాలు వెనక్కి పెట్టారు. పుస్తకాలు రంగురంగులవి పెట్టారు. అవి ముట్టుకోవాలనే ఆరాటంతో బుజ్జిగాడు కాస్సేపు ఆలోచించాడు.

ఈలోపుగా చూసేవాళ్ళంతా సతమతమైపోతున్నారు వాడేం ముట్టుకుంటాడా అని.

చకచకా ప్రాకుకుంటూ వెళ్ళి, వెనుకవైపు లడ్డూ తీసుకుని నాకసాగేడు.

"వెధవాయ్ ముందు పుస్తకాలు పెడితే చూడవ్" అని బాధపడ్డాడు శ్రీనివాసరావు.

"ముచ్చటగా మూడు సార్లు చూడాలండీ. మూడుసార్లులో ఏది ఎక్కువైతే అదే లెక్క" అంది అతని శ్రీమతి. ఎమెండ్‌మెంట్ ఇచ్చారు

రూల్స్‌కి. అది మనిష్టమేకదా. ఉపవాసం వున్నప్పుడు నీరసంగా వుంటుం దనిపిస్తే కొంచం పాలు, మరీ అనిపిస్తే రెండు అరటిపళ్ళు, ఇంకా వుండ లేకపోతే కొంచం చలిమిడి ముద్దా, చివరకి ఉడకపెట్టనివి ఏవైనా తినొచ్చు. అలాగన్నమాట.

మిఠాయిలు అన్నీ యాంగిల్స్‌కి మార్చి చూశారు. వాడు మూడు సార్లూ మిఠాయిలే తిన్నాడు. "అయితే ఈ వెధవ తిండిపోతు అవుతాడన్న మాట. నా ఆశలన్నీ అడియాసలై పోయాయి" అని బాధపడిపోసాగేడు శ్రీనివాసరావు.

అతని ఎదురుగా బుజ్జిగాడు ఘటోత్కచునిలా తింటున్న దృశ్యం కనపడింది.

"ఛ వెధవ" అని లోపలికి వెళ్ళిపోయాడు. ఇంతకీ బుజ్జిగాడు ఏం చేస్తాడో ఎవరికి తెలుసు?

—o—

## అసలు సంగతి!

మా దగ్గర బంధువుల ఇంట్లో పెళ్ళి అయితే పిల్లల్ని తీసుకుని విజయవాడ వచ్చాను. మా వారికి సెలవు లేక పెళ్ళికి రాలేదాయన.

ఆరోజు పగలు పన్నెండు గంటలకు లగ్నం. ఉదయం అందరం స్నానాలు చేస్తున్నాము. స్నానాల హడావిడి. మా ముగ్గురు అమ్మాయిలకు స్నానం చేయించాను. నేనుకూడా స్నానంచేసి విడిదిలోంచి వస్తున్నాను.

మా దూరపుబంధువు బామ్మగారు ఎదురయ్యారు. "అమ్మాయ్ నీళ్ళోసుకున్నావా?" అన్నారామె కుశల ప్రశ్నలయ్యాక.

"అవునండి" అన్నాను. ఆవిడ వెళ్ళిపోయింది.

పెళ్ళి అయ్యాక ఆ రాత్రి ఊరేగింపు వగైరా అన్నీ అయ్యాయి.